www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 08 ఏప్రిల్ 2023

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎంపీపీ తుల శ్రీనివాస్

బోథ్ : అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఎంపీపి తుల శ్రీనివాస్ అన్నారు. కుచలాపుర్‌లో గురువారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబాన్ని ఎంపిపి పరామర్శించారు. తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ తరఫున రూ.8000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని హామీ ఇచ్చారు. పిప్పల్‌దరి గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్ కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎంపీపీ ఆయనకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం రూ.5000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమౌళి, నాయకులు బాబుసింగ్, శ్రీధర్‌రెడ్డి, జుగాదిరావు, మహిపాల్, రాజేశ్వర్, విజయ్ పాల్గొన్నారు.



మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ నిరసన చేపట్టాలి

నవతెలంగాణ-నిర్మల్

ప్రధాని మోడీ పర్యటనకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు డాకూరి తిరుపతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణకు వివిధ సందర్భాల్లో చేసిన వాగ్దానాలు, రాష్ట్ర విభజన చట్టం ప్రకారం దక్కాల్సిన హక్కులు, వాటాలను కేంద్ర ప్రభుత్వం నిరాకరిస్తూ నిర్లక్ష్యం చేస్తూ వివక్షను ప్రదర్శిస్తోందని విమర్శించారు. సింగరేణి లాంటి సంస్థలను పూర్తిగా ప్రైవేటీకరించడానికి పూనుకుంటోందని పేర్కొన్నారు. తాజాగా సింగరేణిలో మరోసారి బొగ్గు గనుల వేలానికి కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలిపారు. గిరిజన, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేటి తెలంగాణ రాకను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలియజేయాలని పేర్కొన్నారు.

నీటి కోసం కోటి తిప్పలు..!

- గిరి పల్లెల్లో అడుగంటిన భూగర్భజలాలు
- వారానికోసారి సరఫరా అవుతున్న భగీరథ నీరు
- దాహం తీర్చుకునేందుకు గిరిజనం ఆపసోపాలు
- సమస్యపై దృష్టిసారించని అధికార యంత్రాంగం

కూటి కోసం కోటి తిప్పలు అనే సామెత..ప్రస్తుతం నీటి కోసంగా మారుతోంది. ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజన పల్లెలు తాగునీటి కోసం తండ్లాడుతున్నాయి. ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మిషన్ భగీరథ పథకం ఆపద కాలంలో ఆదుకోవడం లేదు. వారానికి ఓ రోజు సరఫరా అవుతుండటంతో మిగితా రోజుల్లో గిరిజనులు ఆపసోపాలు పడుతున్నారు.గ్రామాల్లోని బావులు అడుగంటిపోవడం, వాగులు ఎండిపోవడం, చేతిపంపులు మరమ్మతులకు గురికావడంతో రోజువారీ తాగునీటి కోసం ఏజెన్సీ వాసులు అల్లాడిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. నీటి సరఫరాను పర్యవేక్షించాల్సిన అధికారులు ఆయా పల్లెల వైపు కన్నెత్తి చూడకపోవడం మూలంగా జనం బాధలు తెలియడం లేదనే విమర్శలున్నాయి. సమస్యను స్థానిక ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌రూరల్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తాగునీటి గోస తీరడం లేదు. కొండలు, గుట్టలు ఎక్కిన మిషన్ భగీరథ పూర్తిస్థాయిలో నీటి సమస్యను పరిష్కరించడం లేదు. ఈ పథకం వచ్చిన నాటి నుంచి గతంలో మాదిరిగా తీవ్రమైన సమస్య లేకపోయినా ఇంకా అనేక పల్లెల్లో సక్రమంగా సరఫరా కావడం లేదు. ప్రతి పల్లెకు పైప్‌లైన్లు వేసి ట్యాంకులు నిర్మించినా సరఫరాలో మాత్రం లోపాలు తలెత్తుతునే ఉన్నాయి. మైదాన ప్రాంతాల్లో రెగ్యూలర్‌గా సరఫరా జరుగుతున్నా.. ఏజెన్సీ ప్రాంతంలో మాత్రం ఈ పరిస్థితి ఉండటం లేదు. కొన్ని గ్రామాల్లో ఎప్పుడు సరఫరా చేస్తారో కూడా తెలియని పరిస్థితి ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలంలోని జంబుల్‌ధరి, బూర్నూర్, హత్తిఘాట్, అసోదబుర్కి, పందిర్‌లొద్ది గ్రామాలతో పాటు నార్నూర్ మండలంలోని గుంజాల, నాగల్‌కొండ, మరపగూడ, గాదిగూడ మండలంలోని కునికాసా, మేడిగూడ, కొత్తపల్లి, ఖడ్కి, రోమన్‌కాసా గ్రామాల్లో వారానికోసారి సరఫరా జరుగుతుండటంతో నీటి ఎద్దడి నెలకొంది.

బావులు, చేతిపంపులే దిక్కు..!

జిల్లాలోని అనేక మారుమూల పల్లెల్లో ఇప్పటికీ తాగునీటి కోసం జనాలు చేతిపంపులు, బోరుబావుల మీదనే ఆధారపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో ట్యాంకుల వరకు నీరు చేరగా.. మరికొన్నింటిలో పంప్‌హౌస్ వరకు చేరుతున్నా అక్కడ్నుంచి ఇంటింటికి సరఫరా కావడంలో అంతరాయం ఏర్పడుతోంది. సరఫరాలో తలెత్తుతున్న చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కరించకపోవడం మూలంగా గిరిజనులు తాగునీటికి తిప్పలు పడాల్సి వస్తోంది. ఇప్పటికీ గ్రామంలోని చేతిపంపులు, శివారులోని బోరుబావుల నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. మిషన్ భగీరథ నీరు తాగితే ఎలాంటి రోగాలు రావడం లేదని.. ఈ నీళ్ల తాగడం అలవాటైన తర్వాత సక్రమంగా రావడం లేదని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. బోరుబావులు, చేతిపంపు నీటిని తాగడం మూలంగా వివిధ వ్యాధులు వస్తున్నాయని వాపోతున్నారు. నీటి మార్పిడి కారణంగా అనారోగ్యానికి గురవుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. కనీసం మండల స్థాయి అధికారులైన వచ్చి గ్రామాల్లో భగీరథ నీటి సరఫరాను పర్యవేక్షిస్తే సమస్య తెలుస్తుందని కానీ వారు ఎక్కడా పర్యటించిన దాఖలాలు లేవని చెబుతున్నారు.

వారానికి కోసం సరఫరా అవుతోంది : మొలాజీ, జంబుల్‌ధరి, ఆదిలాబాద్ గ్రామీణం



గ్రామానికి మిషన్ భగీరథ నీరు వారానికి ఒకసారి సరఫరా జరుగుతోంది. మిగితా రోజుల్లో చేతిపంపుతో పాటు సమీపంలోని బావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. వివిధ అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. భగీరథ నీరు రావడం లేదని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు దృష్టిసారించి సమస్యను పరిష్కరించాలి.

బోరు బావి నుంచి తెచ్చుకుంటున్నాం : అనిల్‌మోటేరావు, మేడిగూడ, గాదిగూడ మండలం



మా గ్రామంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. ఊరి బయట కిలోమీటరు దూరంలో ఉన్న బోరుబావి నుంచి నీటిని తెచ్చుకుంటున్నాం. ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భగీరథ నీటిని సక్రమంగా సరఫరా చేయడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టిసారించి సరఫరాను పునరుద్ధరించాలి.



ఆదిలాబాద్ గ్రామీణం మండలం జంబుల్‌ధరిలోని పరిస్థితి ఇది. ఈ గ్రామానికి భగీరథ నీరు వారానికి ఓ సారి సరఫరా అవుతుండటంతో స్థానికంగా ఉన్న చేతిపంపు మీదనే ఆధారపడుతున్నారు. ఊరికి సమీపంలో ఉన్న బావి నుంచి గ్రామంలోనికి పైప్‌లైన్ వేసుకొని నీటి సరఫరా చేసుకుంటున్నారు. ఇదే పంచాయతీ పరిధిలోని అడ్డగుట్టలోనూ తాగు నీటి తాపం ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు.



సిరికొండ మండలం తిమ్మాపూర్‌లో నిర్మించిన వాటర్ ట్యాంకు ఇది. దీనిని నిర్మించి సుమారు నాలుగేండ్లు అవుతోంది. ఈ ట్యాంకు వరకు మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. కానీ ఇక్కడ్నుంచి గ్రామంలోనికి నీటి సరఫరా ఇవ్వకపోవడంతో వృధాగా ఉంటుంది. దీంతో గ్రామస్తులు రోజువారీ అవసరాలకు స్థానికంగా ఉన్న చేతిపంపు నీటిని వినియోగిస్తున్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు



పని చేసుకొని బతకాలని, ఎప్పుడూ సెల్‌ఫోన్ చేతిలో ఉంటే అన్నం పెడుతుందా? అని తల్లిదండ్రులు మందలించినందుకు యువకుడు రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కోడద్ గ్రామానికి చెందిన కొల్లూరి తేజ(21) గురువారం రాత్రి గ్రామ సమీపాన రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎప్పటిలాగే తేజ బయటకు వెళ్లి రాత్రికి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు అన్నం తినడానికి పిలిచారు. స్నేహితులతో కలిసి పబ్జి గేమ్ ఆడుతుండగా తల్లిదండ్రులు గట్టిగా మందలించారు. అదే రోజు రాత్రి రైలు పట్టాల వద్దకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

మండల పర్యటనలో భాగంగా మండల కేంద్రంలోని రైతువేదికలో కళ్యాణ లక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి బిడ్డకి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద అన్నల, మామల అండగా నిలుస్తూ రూ.లక్ష పంపిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన 77 మంది లబ్దిదారులకు రూ.77,08,932 విలువ గల కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజారాం, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ తిరుమల, ఉప సర్పంచ్ విలాస్, మండల నాయకులు పాల్గొన్నారు.

దళితులు ఐక్యంగా వేడుకలను జరుపుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

దళితులు ఐక్యంగా ఉంటూ వివిధ వేడుకలను జరుపుకోవాలని ఎమ్మెల్యే జోగు రామన్న ఆకాంక్షించారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఏర్పడ్డ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే నూతన అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు విశేష కృషి చేసిన మహనీయులను ఆదర్శంగా తీసుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని పేర్కొన్నారు. కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన దుర్గం శేఖర్ ఇతర సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో నూతన అంబేద్కర్ విగ్రహాన్ని లాంఛనంగా ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన ఉత్సవ కమిటీ సభ్యులు బాబా సాహెబ్ కామ్లే, మల్లన్న, శోభాతాయి తుల్జాపురే, రత్న జాడే ప్రజ్ఞకుమార్ పాల్గొన్నారు.

చర్చిల్లో ఉచితంగా మజ్జిగ పంపిణీ



నవతెలంగాణ-ఉట్నూర్

గుడ్ ఫ్రైడేను పురస్కరించుకొని కాంగ్రెస్ యువజన విభాగం ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని లక్కారంలో గల బేతాస్థా, పట్టణంలోని సీఎస్ఐ చర్చిలలో మధ్యాహ్న సమయంలో కాంగ్రెస్ యువజన విభాగం మండల నాయకుడు దుర్వ మహేశ్ ఆధ్వర్యంలో మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయడంతో పాటు సేవా కార్యక్రమాలు సైతం నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలంలోని ప్రతి గ్రామానికి వెలుతూ యువజన విభాగం గ్రామ కమిటీలను నియమించడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా కార్యకర్తలను సిద్ధం చేసేందుకు తగు కార్యాచరణతో ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్, ఉట్నూర్ న్యాయవాది రాజు, యువకులు, పార్టీ నాయకులు మహేశ్, రవి, మహేష్, శ్రావణ్, పవన్ పాల్గొన్నారు.

బాసర ఆలయంలో భక్తుల కోలాహలం

నవతెలంగాణ-బాసర

సరస్వతీ దేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తుల కోలాహలం నెలకొంది. సెలవు దినం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. ఉదయం నుండి భక్తులు గోదావరి నదిలో స్నానాలు చేసి నది తీరాన గల శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు చిన్నారులు అమ్మవారి దర్శనానికి క్యూలైన్లో బారులు తీరారు. భక్తులు తమ చిన్నారులకు ఆలయంలోని అక్షరాభ్యాసం మండపాలలో ఆలయ అర్చకులతో అక్షరాభ్యాస పూజలను జరిపించి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అన్నదాన సత్రంలో ప్రసాదాన్ని స్వీకరించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

రక్తదానంతో మరొకరికి పునర్జన్మ

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

రక్తదానంతో మరొకరికి పునర్జన్మ ప్రసాదించవచ్చని, ఆరోగ్య ఆదిలాబాద్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిఎస్ అన్నారు. శుక్రవారం రిమ్స్ ఆడిటోరియంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ మెడికల్, ఆల్ ఇండియా ఫిజిషియన్స్ అసోసియేషన్, రిమ్స్ జూడాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని, 18 సంవత్సరాలు నిండిన ఆరోగ్యవంతులు ఎవరైనా రక్తదానం చేయవచ్చని అన్నారు. జిల్లాలోని మారుమూల గ్రామాల నుండి వచ్చే గర్భిణులకు, రోడ్డు ప్రమాదాల బాధితులకు, ఇతర వైద్యసేవలకు ప్రతి నిత్యం రక్త నిల్వలు అవసరం ఎంతో ఉంటుందని అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని, వైద్యులు ప్రాణాలను కాపాడటంతో పాటు రక్తదానం చేయడం గొప్ప విషయమని అన్నారు. దేశ అభివృద్ధికి సౌభాగ్యానికి ఆరోగ్యాంగా ఉండడం ఎంతో ముఖ్యమని, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వివిధ మెడికల్ అసోసియేషన్ సభ్యులు, జూనియర్ డాక్టర్లు సమన్వయంతో మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో మరిన్ని రక్తదాన శిబిరాల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. ఆర్గాన్ డొనేట్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. అనంతరం రక్తదానం చేసిన వైద్యులకు కలెక్టర్ పండ్లు, ఓఆర్ఎస్ అందజేశారు. ఈ రక్తదాన శిబిరంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, డాక్టర్లు మనోహర్, అశోక్, తిప్ప స్వామి, ఐఎంఏ, ఏపీఐ, జూడాల ప్రతినిధులు డాక్టర్లు ప్రమోద్‌రెడ్డి, శ్యాంప్రసాద్, సుమలత, వెంకట్‌రెడ్డి, చంద్రశేఖర్, అక్షిత, రవి పాల్గొన్నారు.



నేరాలను అదుపు చేయడానికే సీసీ కెమెరాలు : డీఎస్పీ ఉమేందర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

నేరాలను అదుపు చేయడానికి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఆదిలాబాద్ డిఎస్పీ ఉమేందర్ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ రూరల్ మండలం బుర్నూర్ గ్రామంలో గ్రామ అభివృద్ధి నిధులు రూ. లక్షా40వేలతో ఏడు సీసీ కెమెరాలను డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి పనులలో ముందుండాలని అన్నారు. గ్రామంలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. మారుమూల గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో పోలీస్ అధికారులను సన్మానించారు. కార్యక్రమంలో సీఐ రఘుపతి, ఎస్సై నాగ్‌నాథ్, సర్పంచ్ కుమ్ర భీంబాయి ముకుంద్‌రావు, ఉప సర్పంచ్ మేకల గంగాధర్, యువకులు సాయిరి స్వామి, మునిగెల సురేష్, స్వామి పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు : ఎమ్మెల్యే రేఖానాయక్



ఖానాపూర్ రూరల్ : ఓటర్లను బురిడీ కొట్టించేందుకు, తప్పుదోవ పట్టించేందుకు మాయమాటలు కల్లబొల్లి కబుర్లు చెబుతున్న పార్టీల మాటలు నమ్మి ఓటర్లు మోసపోవద్దని ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని తర్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఆమె మాట్లాడారు. మండలంలోని 11 గ్రామాల నుంచి తరలివచ్చిన బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులకు ఆమె అభినందనలు తెలిపారు. చేసిన అభివృద్ధిని చూసి ఆదరించాలన్నారు. కార్యకర్తలే తన బలమని, కార్యకర్తల గుండెల్లో నిలిచిన నాయకురాలిగా పేరు తెచ్చుకున్నానని పేర్కొన్నారు. ప్రజల గుండెల్లో తలదాచుకున్న తనను ఎవరూ ఏమీ చేయలేరని చెప్పారు. కెసిఆర్ ప్రభుత్వం పేద బడుగు బలహీన వర్గాల అవసరాలను గుర్తించి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో లక్షాపదివేల మందికి పెన్షన్లు వర్తింపజేస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలో 8వందల పెన్షన్లు ఇచ్చినట్లు ఉదాహరణగా చెప్పారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు తాళ్లపల్లి రాజగంగన్న అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మండలంలోని 11 గ్రామాలకు చెందిన సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో పలువురు చేరుతున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సామాన్యులపై బిజెపి అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ శుక్రవారం బేడ బుడగ జంగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పసుపుల రాజుతో పాటు రాంనగర్ కాలనీకి చెందిన పలువురు మహిళలు యువకులు బిజెపి, కాంగ్రెస్ పార్టీలను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందుత్వం పేరుతో ఓట్లు దండుకునే బిజెపి ప్రజలకు అవసరమైన ఏ ఒక్క కార్యక్రమమైనా చేపట్టిందా అని ప్రశ్నించారు? ఒక పక్క మహిళలు మరోపక్క యువత, రైతాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసి బడా కార్పొరేట్ వ్యక్తులకు తొత్తుగా మారిందని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలు, కేంద్ర మోసపూరిత వాగ్దానాలను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికలలో ప్రజలే ఆ పార్టీకి సరైన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గండ్రత్ రమేష్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, పసుపుల రాజేష్, ప్యారంవార్ అశోక్, సతీష్ యాదవ్, రమణ, లక్ష్మీ, స్వప్న గంగమ్మ, సుశీల, గంగారావు పాల్గొన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి ఉండదు : ఎమ్మెల్యే రామన్న

ఆదిలాబాద్ అర్బన్ : వేసవి నేపథ్యంలో పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే జోగు రామన్న స్పష్టం చేశారు. శుక్రవారం ఫిల్టర్ బెడ్‌లో ఇటీవల పలు మరమ్మత్తు పనులను యుద్ధ ప్రాతిపదికన చేయించగా ఆధునీకరించిన పైప్‌లైన్ నీటి సరఫరాను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పనుల వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రస్తుత నీటి సామర్థ్యం, సరఫరా వంటి అంశాలపై ఆరా తీశారు. స్థానిక అధికారులు, సిబ్బందికి విస్తృత సూచనలు చేశారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు మంచి నీటి సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎమ్మెల్యే జోగు రామన్న మాట్లాడుతూ వేసవి కాలంలో సాధారణంగా ప్రజలు ఎదుర్కొనే మంచి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామని పేర్కొన్నారు. ఫిల్టర్ బెడ్‌లో చిన్నపాటి మరమ్మతులు, పరికరాల మార్పు వంటి పనులపై ప్రత్యేక దృష్టి సారించి పనులను పూర్తి చేయించామని వివరించారు. మావల నుండి ఫిల్టర్ బెడ్ వరకు 2ఎంఎల్‌డిల నీరు సరఫరా అవుతోందని, ప్రస్తుతం అయిదు వార్డులకు అందించే నీటి సరఫరాలో ఇబ్బందులు పరిష్కారమయ్యాయని వెల్లడించారు. అన్ని వార్డులకు ప్రతి నిత్యం మంచి నీటి సరఫరా అయ్యేలా ఇంజనీరింగ్, మిషన్ భగీరథ అధికారులతో కలిసి ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ, కమిషనర్ ఏ. శైలజ, కౌన్సిలర్లు అశోక్ స్వామి, ఆవుల వెంకన్న, ప్రకాష్, డాక్టర్ లక్ష్మణ్, బిఆర్ఎస్ మహిళా విభాగం పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు స్వరూప రాణి, బొడగం మమత పాల్గొన్నారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని మల్లాపూర్, లక్ష్మణచాంద సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తు పనులు జరుగుతున్న దృష్ట్యా శనివారం ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ మహేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్
2
శనివారం 08 ఏప్రిల్ 2023

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడొద్దు

నవతెలంగాణ-ఖానాపూర్



పదో తరగతి విద్యార్థులు జీవితాలతో చెలగాటమాడొద్దని ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శవయాత్ర చేసి, దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టీఎస్పీఎస్సీ, పదో తరగతి ప్రశ్న పత్రాలను లీకేజీ చేసి, విద్యార్థుల బంగారు భవిష్యత్తును దెబ్బతీస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా బీజేపీ నాయకుల ఆగడాలు మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ అబ్దుల్ కలీల్, నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం మండలం మామిడిగూడ గ్రామంలో నిర్వహించిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిభిరానికి డీఎస్ఎస్ఏ కార్యదర్శి క్షేమా దేశ్‌పాండే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని అన్నారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించుకున్న వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, డిప్యూటీ తహసీల్దార్ గణేష్, అంకోలి వైద్యాధికారి రాహుల్ గడపాలే, డాక్టర్ ప్రశాంత్, ఫార్మసిస్ట్ రాష్ట్రపాల్, సర్పంచ్ యాదవ్‌రావు, వైద్య సిబ్బంది కళ్యాణ్, సూపర్‌వైజర్ లక్ష్మి మడావి శ్రీనివాస్, ప్రేమ్‌సింగ్, హిందుబాయి, రుక్మిణి, సునీత, తుర్పబాయి పాల్గొన్నారు.

రాంజీగోండ్ వర్ధంతిని జయప్రదం చేయాలి



నవతెలంగాణ-ఉట్నూర్

బ్రిటిష్‌తో పోరాడి అమరుడైన రాంజీగోండ్ వర్ధంతిని జయప్రదం చేయాలని ఉత్సవ కమిటి నాయకులు మర్సుకొల తిరుపతి అన్నారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు గిరిజనులకు భూమి, భుక్తి, విముక్తి, కొరకు బ్రిటిష్‌వాళ్లను గడగడలాడించి, ఉద్యమించిన వారిలో గిరిజన వీరుడు రాంజీగోండ్ ఒకరని అన్నారు. ఆయన జీవిత చరిత్రను చరిత్రపుటల్లో ఎక్కాంచాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. పోరాటాల్లో మొట్టమొదటి గిరిజన అమరుడు రాంజీగోండేనని అన్నారు. నేటి ఆదివాసీ సమాజం ఆయను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని అన్నారు. రాంజీగోండ్ 166వ వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించి, ఆయన చరిత్రను మరుగున పడకుండా కాపాడి, పాఠ్యపుస్తకాల్లో వచ్చేల చూడాలని, ఆయన విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వర్ధంతి వేడుకలను ఈ నెల 9న మండలంలోని లక్కారం పంచాయతీ పరిధిలోని రాంజీగోండ్ నగర్ కాలనీలో నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఆదివాసులు, గిరిజన, ప్రజాసంఘాల, నాయకులు తరలివచ్చి విజయంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు దేవురావ్, మెస్రం మనోహర్, ఆత్రం భుజంగ్‌రావు, ఆత్రం సుగుణ, హన్మంత్‌రావు, కోటేష్, సోనేరావు, మానిక్‌రావు, మహేందర్, రాజన్న ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డు మృతి

నవతెలంగాణ-లోకేశ్వరం



విధులు నిర్వహించుకొని స్వగ్రామానికి వెళ్తున్న హోంగార్డు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన లోకేశ్వరం మండలంలోని మొహలా గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న గడ్‌చాంద గ్రామానికి చెందిన తుంగెన నర్సింగ్‌రావు(51) హోంగార్డు గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన వీర హనుమాన్ శోభాయాత్ర బందోబస్తుకు విధులు నిర్వహించేందుకు వెళ్లాడు. అనంతరం తిరుగు ప్రయాణంలో స్వగ్రామమైన గడ్‌చాందకు బైక్‌పై వస్తుండగా మొహాల గ్రామ సమీపంలో బైక్ అడవి పందికి ఢీ కొట్టి అదుపు తప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు లోకేశ్వరం పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకోని క్షతగాత్రుడిని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడు రుయ్యాడిలో బలగం సినిమా ప్రదర్శన

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామంలో శనివారం రాత్రి 7గంటలకు హస్సేన్ హుస్సేన్ ఫంక్షన్ హాల్‌లో బలగం సినిమా ప్రదర్శిస్తున్నట్టు విజయ డెయిరీ మాజీ చైర్మెన్ లోక భూమారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సినిమా ప్రదర్శనకు అయ్యే ఖర్చును తానే భరిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులతో పాటు వివిధ గ్రామాల నుండి వచ్చి సినిమాను తిలకించాలని కోరారు. పెద్ద స్క్రీన్‌పై బలగం సినిమాను ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు. నేటి సమాజంలో అంతరిస్తున్న మానవ సంబంధాలు ఓకే తాటిపై తెచ్చేందుకే సినిమాను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

బడుగు బలహీన వర్గాల అభివృద్దే బీజేపీ ధ్యేయం

నవతెలంగాణ-బాసర

బడుగు బలహీన వర్గాల ఆర్థిక అభివృద్దే బీజేపీ పార్టీ ధ్యేయమని నిర్మల్ జిల్లా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దడిగే బోజన్న అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కిర్గుల్(బి) గ్రామంలో ఇంటింటికి బీజేపీ గ్రామ గ్రామాన ఓబీసీ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 8 సంవత్సరాల కాలంలో కేసీఆర్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బిడ్డలకు అనేక రంగాలలో అన్యాయం చేసిందని, కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న వాటి అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుపేదలకు ఆయుష్మాన్ భారత్, గరీబ్ కళ్యాణ్ యోజన కింద ఉచిత రేషన్ బియ్యం అందిస్తున్న ఘనత కేంద్ర ప్రభుత్వానిదని, దేశ ప్రధాని నరేంద్ర మోడీదని అన్నారు. ప్రతి గ్రామంలో శ్మశాన వాటికతో పాటు సీసీ, డ్రైనేజీలు ఉపాధి హామీ కింద కూలీలకు పని కల్పించడం, రైతు వేదికలు నిర్మించడం, గ్రామ పంచాయతీ కింద కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తున్న సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు బెజ్జంకి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగనాథ్, మాజీ సర్పంచ్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీటీసీ నర్సారెడ్డి, చరణ్, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాజీరావు బాబా ముగింపు పుణ్యతిథి

నవతెలంగాణ-జైనథ్



బాజీరావు బాబా పుణ్యతిథిని పురస్కరించుకొని ప్రత్యేకంగా నిర్వహించే సప్తహ ముగింపు వేడుకల్లో భాగంగా శుక్రవారం మండలంలోని కరంజి గ్రామంలో ఏర్పాటు చేసిన బాజీరావు బాబా ముగింపు పుణ్యతిథి కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగు రామన్న ముఖ్యఅతిథిగా పాల్గొని, వేడుకలను కొనసాగించారు. మొదట బాజీరావు బాబా చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించి బాజీరావు బాబా శోభ యాత్రను కొనసాగించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన భజన మండలిలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బాజీరావు బాబా పుణ్యత కార్యక్రమాల్లో పాలు పంచుకోవడం ఆనందాన్ని కలిగిస్తుందని అన్నారు. బాజీరావు బాబా స్ఫూర్తి కట్టుబాట్లు నియమాలు నేటి యువతతో పాటు గ్రామాలను సైతం సన్మార్గంలో నడిపిస్తూ ఆధ్యాత్మికతకు దోహదపడిందని అన్నారు. వారి అడుగుజాడల్లో మద్యం మాంసాహారాలు మాని గ్రామంలో పరిశుభ్రత వైపు అడుగులు వేస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రౌతు మనోహర్, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జిల్లా రైతుబంధు సమన్వయ సమితి అధ్యక్షులు రోకండ్ల రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకట్‌రెడ్డి, రైతుబంధు నాయకులు లింగారెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా మురుగు కాలువలు

ఇండ్లలోకి మురుగు నీరు

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-ఖానాపూర్

ఖానాపూర్ పట్టణం మేజర్ గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చెందింది. అప్పటి నుంచి అభివృద్ధి కొనసాగుతున్నప్పటికీ, మురికి కాలువల నిర్మాణం జరుగడం లేదని పాత మురికి కాలువలు అవి చిన్నగా ఉండి శిథిలావస్తలో ఉన్నాయి. వాటిని మున్సిపల్ అధికారులు గుర్తించి, పెద్దగా నిర్మించాల్సి అవసరం ఉంది. కాని పాలక వర్గం వాటిపై దృష్టి సారించకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. అవి పురాతన మురికి కాలువలు కావడంతో చెత్త చెదారంతో నిండి అవి మురికి నీరు రోడ్లపై పారడంతో పాటు ఇండ్లలోకి చెరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖానాపూర్ పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఎన్నో ఏండ్లుగా మురికి కాలువ సమస్య ఉందని తెలిపారు. ఖానాపూర్ మున్సిపాలిటీగా మారిన శ్రీరామ్ నగర్ కాలనీ అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని వాపోతున్నారు. పట్టణం మొట్టమొదటిగా ఏర్పడింది శ్రీరామ్‌నగర్ కాలనీ కావడం ఈ కాలనీలో గతంలో వేసిన డ్రైనేజీలు ఇరుకుగా ఉండటం వల్ల డ్రైనేజీలు నిండుకుని రోడ్లపై నీరు పారుతూ కంపు కొడుతున్నాయి. అంతేకాకుండా రోడ్డు పక్కనే ఉన్న ఇండ్లలోకి మురుగునీరు సైతం చెరుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పారిశుధ్యం లోపించి, తరుచూ అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ కార్మికులు తరుచూ డ్రైనేజీలోని చెత్తను తీస్తున్నప్పటికీ, డ్రైనేజీలు ఇరుకుగా ఉండటంతో తొందరగా చెత్తాచెదారం నిండుకుని పైపులకు మురుగునీరు రోడ్లపై నుండి పారుతుందని పేర్కొంటున్నారు. అంతేకాకుండా ఖానాపూర్ పట్టణంలోని బర్కత్‌పుర, సాయినగర్, అంబేద్కర్ నగర్, ఇంద్రనగర్, సుభాష్ నగర్, గాంధీనగర్, అశోక్‌నగర్, కసాఫ్ గల్లిలో సైతం డ్రైనేజీలు చిన్నగా ఉండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు పేర్కొంటున్నారు. ఖానాపూర్ మున్సిపల్ పరిధిలో అన్ని కాలనీల్లో పెద్ద డ్రైనేజీలు ఏర్పాటు చేసి, కాలనీవాసుల సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త డ్రైనేజీ వ్యవస్థను నూతనంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.





చెత్తా పేరుకుపోయి దుర్గందం వేదజల్లుతోంది

పాలేపు శారద గృహిణి -శ్రీరామ్ నగర్



పట్టణంలోని పాత మురికి కాలువలు చిన్నవిగా ఉండటంతో అవి చెత్తతో నిండిపోయి. నీరు రోడ్లపైకి, ఇండ్లలోకి చెరుతోంది. చెత్త నిండటంతో దుర్గందం వెదజల్లుతోంది. మున్సిపల్ అధికారులు స్పందించి మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి, మురికి కాలువలను పెద్దగా నిర్మించాలి.

నూతన డ్రైనేజీలను ఏర్పాటు చేయాలి

వాకిటి సుకన్య గృహిణి-ఖానాపూర్



ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆయా కాలనీల్లో నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. గతంలో పాత డ్రైనేజీల వల్ల చెత్తాచెదారంతో కూరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి నూతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- బీజేపీ నాయకుల మాటలు నమ్మితే మోసపోతారు
- అందరి సహకారంతో నిర్మల్‌ను మరింత అభివృద్ధి చేస్తా
- నిర్మల్ పట్టణ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ-నిర్మల్



అభివృద్ధిని చూసి ఆశీర్వదించండని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్మల్ పట్టణం బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ సమీపంలో జరిగిన నిర్మల్ పట్టణ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరయ్యారు. పట్టణానికి చెందిన వార్డులు 2, 3, 4, 5, 6, 24, 25, 26, 27, 39 కార్యకర్తలకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిర్మల్ ప్రజల సహకారంతో నిర్మల్‌ను మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. 75 ఏండ్ల పాలనలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. ప్రస్తుతం తెలంగాణ వచ్చాక, రాకముందు అభివృద్ధిపై ప్రజలు చర్చించుకుంటున్నారని అన్నారు. అనేక ఉద్యమాలు, పోరాటాల ఫలితంగా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో, ఊహించని విధంగా సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోతో సంబంధం లేకుండా సీఎం కేసీఆర్ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త పథకాలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. నిర్మల్ నియోజకవర్గంలో 80 వేల మందికి పింఛన్లు ఇస్తున్నట్లు తెలిపారు. 2000 ఆసరా పెన్షన్‌తో ఆత్మ గౌరవం పెరిగిందని అన్నారు. బీజేపీ నాయకుల మాటలు నమ్మితే మోసపోతామని అన్నారు. వారి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు లేవు కానీ తెలంగాణాకు వచ్చి పథకాలు ఇస్తామంటున్నారని బీజేపీ ప్రభుత్వాన్ని ఎద్దేవా చేశారు. నిర్మల్ పట్టణంలో 1400 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తున్నామని అన్నారు. 600 ఇండ్లు సిద్దాపూర్‌లో కడుతున్నామని, మరో 1000 ఇండ్లు త్వరలో నిర్మిస్తామని అన్నారు. గృహ లక్ష్మీ పథకం ద్వారా స్థలం ఉంటే ఇల్లు కట్టుకోవడానికి రూ.3లక్షలు ఇస్తామని తెలిపారు. 1100 మందికి ఈ సారి నిర్మల్‌లో దళితబంధు పథకం ఇస్తామని అన్నారు. సీఎం కేసీఆర్ నిర్మల్‌కు వచ్చినపుడు అభివృద్ధి కోసం రూ.50 కోట్ల నిధులు అడుగుతామని అన్నారు. ఇప్పటికే మెడికల్ కాలేజి వచ్చిందని, 400 పడకల ఏరియా ఆసుపత్రి వచ్చిందని అన్నారు. నర్సింగ్ కాలేజీ సైతం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మల్ మున్సిపాలిటీని అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. యాదాద్రి ఆలయం వలె కృష్ణ శిలలతో మహాలక్ష్మి ఆలయం నిర్మించినామని అన్నారు. అడెల్లి పోచమ్మ, బాసర ఆలయాలను కృష్ణ శిలలతో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అందరి ఆశీర్వాదంతో నిర్మల్‌ను మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, వార్డు కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారుల మెరుపు దాడులు

- దాడుల్లో సుమారు రూ.6లక్షల విలువైన ఫర్నీచర్, యంత్రాల స్వాధినం
- అడవుల సంరక్షణకు నిరంతరంగా చర్యలు : ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ కోటేశ్వర్‌రావు



నవతెలంగాణ-ఉట్నూర్

అక్రమంగా కలపను తీసుకొచ్చి ఫర్నీచర్ తయారు చేస్తున్న వారిపై శుక్రవారం ఉదయం ఫారెస్ట్ అధికారులు మెరుపు దాడి చేశారు. ఈ దాడి ఇన్‌చార్జ్ సబ్ డీఎఫ్ఓ కోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఖానాపూర్, పెంబి, కడెం, ఉడుంపూర్, ఉట్నూర్ కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని బీర్సాయిపేట, సిరిచెల్మ, జోడేఘాట్, కెరమెరి, ఉట్నూర్, జన్నారం రేంజీల పరిధిలోని డాగ్‌స్క్వాడ్ సిబ్బందితో సుమారుగా 150 మంది ఫారెస్ట్ సిబ్బందితో ఏకకాలంలో ఉట్నూర్ పరిసర ప్రాంతాలైన పాత ఉట్నూర్, శాంతినగర్, గంగన్నపేట్ కాలనీలలో కార్పెంటర్ ప్రభాకర్, మధుకర్, రాజన్న, రాజేశ్వర్, పవన్, కరీం, రాజన్న ఇండ్లపై దాడులు చేశామని అన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో దాడులు చేయాగా సుమారుగా రూ.6లక్షల విలువైన పర్నీచర్‌తో పాటుగా పర్నీచర్ తయారు చేసే యాంత్రాలను సైతం స్వాధినం చేసుకున్నామని అన్నారు. ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి, శ్యాంపూర్, బీర్సాయిపేట గ్రామాల్లో, మారుమూల ప్రాంతాలైన చిన్న గంగాపూర్, రాజులమడుగు గ్రామాల్లో, సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా కలపను తరలించి పర్నిచర్ తయారు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు రెండు క్లస్టర్ల, తొమ్మిది డివిజన్లు, 14 రేంజీల ఆధ్వర్యంలో 150 మంది అటవీ శాఖ సిబ్బందితో వేరే వేరే ప్రాంతాల్లో ఒకే సారి తనిఖీలు చేసి కలపను, పర్నీచర్, యంత్రాలను స్వాధినం చేసుకున్నామని, దాడుల్లో పట్టుబడిన 15మందిపై కేసులు నమోదు చేశామని త్వరలోనే వారిని తహసీల్దార్ ముందు ప్రవేశపెట్టి బైండోవర్ చేస్తామని అన్నారు. ఎవరైన అక్రమంగా కలపను తీసుకవచ్చి పర్నీచర్ తయారు చేసిన, చేయించుకున్న, రవాణ చేసిన వారిని ఉపేక్షించేది లేదని అన్నారు. ఇక నుంచి నెలలో రెండు సార్లైన ఇలాంటి దాడులు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం అడవుల సంరక్షణకు నిరంతరంగా తగు చర్యలు తీసుకుంటున్నామని సిబ్బంది సైతం బాధ్యతయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆయన వెంటన అటవీ శాఖ డీఆర్వోలు, ఎఫ్ఆర్వోలు, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్బీఓలు, సిబ్బంది ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

బీఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలో పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు మాట్లాడుతూ ఆనాడు మండల కేంద్రానికి కూడా రోడ్లు సరిగా లేని రోజులు చూశామని అన్నారు. ఈరోజు తెలంగాణ రాష్ట్రం వచ్చాక గిరిజన గ్రామాల చిరకాల వాంఛలను నెరవేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పాటు పడ్డ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు పార్టీ ఎల్లవేళలా అండగా నిలుస్తుందని అన్నారు. అదేవిధంగా మనం చేసిన అభివృద్ధి పనులను పార్టీ నాయకులు ఇంటింటికి చేర్చాలని అన్నారు. బీజేపీ నాయకులు కేసీఆర్‌ని జైలుకు పంపిస్తామని ఆరోపణలు చేయడం సరైంది కాదని అన్నారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని అన్నారు. అనంతరం పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, మండల కన్వీనర్ రాజారాం, అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, సర్పంచ్ లావణ్య, ఎంపీటీసీ తిరుమల, ఉప సర్పంచ్ విలాస్‌లతో పాటు ఎఎంసీ చైర్మెన్, ఆయా మండల జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మండల నాయకులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో రోడ్డు మరమ్మత్తు



నవతెలంగాణ-జైనథ్

మండలంలోని తరోడ గ్రామం వద్ద శుక్రవారం ఉదయం పగిలిపోయిన వంతెన పనులను బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ తన సొంత ఖర్చుతో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ బ్రిడ్జి దాదాపు రెండున్నర నెలల నుంచి ఉపయోగంలోకి లేకుండా పోయింది. ఆ రోడ్డు మీద నడిచే వాహనదారులకు తృటిలో ప్రమాదం తప్పింది. అప్పట్లో స్థానిక ఎమ్మెల్యే దీన్ని రెండు మూడు రోజుల్లో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభిస్తామని అన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చలనం లేదని అన్నారు. మరో రెండు నెలల్లో వర్షాకాలం మొదలవుతుంది అప్పుడైతే పరిస్థితి ఇంకా ఘోరంగా ఉంటుందని అన్నారు. ఈ రెండు నెలల్లో తాత్కాలిక వంతెన నిర్మిస్తే కానీ వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం ఉండదు. జాతీయ రహదారి నుండి మహారాష్ట్రను కలుపుతున్న ఈ అంతర్రాష్ట్ర రోడ్డుపై వేల సంఖ్యలో ప్రతినిత్యం వాహనాలు తిరుగుతుంటాయని అన్నారు. తాత్కాలికంగా నిర్మించిన ఇరుకైన ఈ రోడ్డుపై పెద్ద సంఖ్యలో వాహనాలు తిరగడంతో గంటల కొద్దీ ట్రాఫిక్ జామ్ అవుతుందని అన్నారు. కొన్నిసార్లు అయితే అదుపుతప్పి వాహనాలు కాలువలో పడిన సందర్భాలు కూడా ఉన్నాయని అన్నారు. నిన్న అంబులెన్స్ కూడా పడింది. అయినా స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్నలో ఎటువంటి చలనం లేదని అన్నారు. తూతూ మంత్రం పనులతో ప్రజలను ఇబ్బంది పెట్టకండని అన్నారు. మాకు కావాల్సింది ఈ తూతూ మంత్రం పనులు కాదని పక్కాగా మాకు బ్రిడ్జిని నిర్మాణం కావాలని అన్నారు. మీరు చేయలేని పనిని ప్రజల సౌకర్యార్థం మేము చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు రాందాస్, బండి గజనన్, పోతరాజు, రమేష్, విఠల్, కార్యకర్తలు ఉన్నారు.

ప్రశ్నపత్రాల లీకేజీల నిలయంగా తెలంగాణ



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

తెలంగాణ రాష్ట్రం ప్రశ్నపత్రాల లీకేజీల నిలయంగా మారిందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా ఇన్‌చార్జ్ మేస్రం భాస్కర్ ఆరోపించారు. శుక్రవారం పట్టణంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంపై సవతి తల్లి ప్రేమను కనబరుస్తోందని, అందుకే వరుసగా ప్రశ్నపత్రాల లీకేజీలు చోటు చేసుకుంటున్నాయని మండిపడ్డారు. ప్రశ్నపత్రాల లీకేజీలు సర్వసాధారణమయ్యాయని అన్నారు. విద్యార్థుల జీవితాలను లీకేజీలతో బలి చేస్తున్నారని అన్నారు. విద్యారంగంపై రాష్ట్ర ప్రభుత్వ అజమాయిషీ కొరవడిందని అన్నారు. విద్యారంగంపై సీఎం కేసీఆర్, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమీక్ష కొరవడిందని ఆరోపించారు. ఇటీవల పదో తరగతి ప్రశ్నపత్రాలు వికారాబాద్, వరంగల్, ఆదిలాబాద్, జిల్లాల్లో లీక్ అయ్యాయని తద్వారా లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. లీకేజీలకు పాల్పడుతున్న వారిని నిర్దిష్టమైన చట్టాల ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పాలకులు 'విద్యారంగంపై' అవగాహన లేమితో పాలిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వానికి అధికార కాంక్షపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేకపోవడం శోచనీయమని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి కేవలం రాజకీయ సమావేశాలకు ఇస్తున్న ప్రాధాన్యత, విద్యారంగ పటిష్టతకు ఇవ్వకపోవడం సిగ్గుచేటని అన్నారు. విద్యాశాఖ అధికారులతో సమీక్షలు, సమన్వయం కొరవడిందని అందు మూలంగానే ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు పునరావృతం అవుతున్నాయని తెలిపారు. లీకేజీలకు బాధ్యులైన వారిపై పీడీ యాక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు. తదుపరి పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మేస్రం సాయి, సిడం గణేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మడవి గణేష్ పాల్గొన్నారు.

పులుల రక్షణపై మానిటరింగ్

నవతెలంగాణ - బెజ్జూర్



పులుల రక్షణపై అటవీ శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు మానిటరింగ్ నిర్వహించాలని ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్ఓ వేణుబాబు అన్నారు. శుక్రవారం బెజ్జూర్ రేంజ్ పరిధిలోని అటవీ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులులు ఏప ప్రాంతానికి వెళ్తున్నాయి, ఎక్కడెక్కడ కనిపిస్తున్నాయనేది ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుండాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో పులులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, పులుల రక్షణపై పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అటవీ శాఖకు సంబంధించిన హద్దులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓలు దయాకర్, రమాదేవి, డిప్యూటీ రేంజర్ శ్రావణ్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 08 ఏప్రిల్ 2023

పూలే విగ్రహ సాధన దీక్షలో జిల్లా నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



హైదరాబాద్‌లో జ్యోతిబాపూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఇందిరా పార్క్ వద్ద బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన పూలే దంపతుల విగ్రహాల సాధన దీక్షలో ఆరే సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే దంపతులు ఎంతో గొప్ప వారని, వారి విగ్రహాలు హైదరాబాద్ కేంద్రంలో ఉండడం వల్ల విశిష్టత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విగ్రహాల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలన్నారు. దీక్షలో పాల్గొన్న వారిలో జిల్లా నాయకులు జయరాం, బిక్కాజీ, భుజాడి కుమార్, ప్రశాంత్, వినోద్ ఉన్నారు.

ఆరోగ్య పరిరక్షణపై అవగాహన



నవతెలంగాణ-హాజీపూర్

ఆరోగ్య పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, అందరికీ సేవలు అందిస్తున్నామని జిల్లా వైద్యారోగ్యశాఖ మాస్ మీడియా కోఆర్డినేటర్ బుక్యా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం హాజీపూర్ మండలంలోని దొనబండ పల్లె దవాఖానలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అందరికీ ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలందరూ ఆరోగ్యం కోసం ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం నినాదంలో భాగంగా జిల్లాలోని 121పల్లె దవాఖానలో స్థానిక ఆరోగ్య కార్యకర్తల ద్వారా అహగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జీవన శైలి, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని అన్నారు. గుండె వ్యాధుల నివారణకు అందరికీ సీపీఆర్ ట్రైనింగ్ త్వరలో ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎండాకాలంలో వడదెబ్బ కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ నామ్‌దేవ్, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ సుమలత, ఆశా వర్కర్లు రజిత, స్రవంతి పాల్గొన్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు



నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంలోని ఇన్ఫంట్ జీసెస్ క్యాథలిక్ చర్చి ఫాదర్ థామస్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సిల్వను మోసుకొని కల్వరి గుట్టపైకి తీసుకెళ్లి ప్రత్యేక ప్రార్ధనలు చేసి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో క్రిస్టియన్‌లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఉపాధి పనుల తవ్వకాల్లో సీతారాముల విగ్రహాలు లభ్యం

నవతెలంగాణ-జన్నారం



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ తవ్వకాల పనుల్లో సీతారాముల పంచలోహ విగ్రహాలు లభ్యమయ్యాయి. శుక్రవారం మండలంలోని తపాలాపూర్ పంచాయతీ పరిధిలో గల రహదారి పక్కన సీఎం ప్లాంటేషన్, అటవీశాఖ నర్సరీలో ఉపాధి హామీ తవ్వకాల పనులు చేస్తుండగా రెండు పంచలోహ విగ్రహాలు బయటపడ్డాయి. వీటిని సీతారాముల విగ్రహాలుగా స్థానికులు గుర్తించారు. విగ్రహాలను తీసి పూజలు చేశారు. రోడ్డున వెళ్లేవారు అక్కడికి చేరుకొని పూజలు చేయడం ఆరంభించారు. సర్పంచ్ నైనాల తిరుపతి, ఉపసర్పంచ్ రాజన్న, ఆర్ఐ భానుచందర్, పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోలీసుల సాయంతో ఆ పంచలోహ విగ్రహాలను తపాలాపూర్ గ్రామంలోని శివాలయానికి తరలించి భద్రపరిచినట్లు తహసీల్దార్ కిషన్ తెలిపారు. అయితే ఆ విగ్రహాలు తిమ్మాపూర్ రామాలయానికి చెందినవిగా భావిస్తున్నారు. 1999లో విగ్రహాలు చోరీకి గురయ్యాయని అంటున్నారు.

గిరి వికాస పథకాన్ని వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధి కోసం తీసుకొచ్చిన గిరి వికాస పథకాన్ని లబ్దిదారులు ఉపయోగించుకోవాలని ఆసిఫాబాద్ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ అన్నారు. మండలంలోని శఖన్‌గొంది గ్రామంలో శుక్రవారం గిరి వికాస పథకంలో భాగంగా బోర్‌వెల్‌కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఆర్థిక అభివృద్ధి సాధించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. దీనికోసమే గిరి వికాస పథకం తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా గిరిజనుల భూములకు కావాల్సిన సౌకర్యాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పున్నంచంద్, నాయకులు గొల్ల, లబ్దిదారులు పాల్గొన్నారు.

యువతకు సర్పంచ్ స్పోర్ట్స్ కిట్ల పంపిణీ


నవతెలంగాణ-ఆసిఫాబాద్

మండలంలోని ఈదులవాడ సర్పంచ్ భీమేష్ గ్రామంలోని యువతకు వాలీబాల్, క్రికెట్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో క్రీడల అభివృద్ధి కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. యువత అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జీతాల కోసం ఎదురుచూపులు..!

- టీఏ, డీఏ ఊసే లేదు
- ఆర్జిత సెలవుల సొమ్ము వచ్చేదెప్పుడు?
- ఈఎంఐలు కట్టలేక పెనాల్టీ చెల్లిస్తున్న ఉద్యోగులు
- సగటు ఉద్యోగుల్లో నిరాశ

ప్రభుత్వ ఉద్యోగం అంటే బతుకుదెరువుపై ధీమా..మెరుగైన వేతనాలు సకాలంలో అందుతాయనే భరోసా..పనిలో ఉత్సాహం నింపే విధంగా టీఏ, డీఏలు, అదనపు ప్రోత్సాహకాలు ఉంటాయనే నమ్మకం..సర్వీసు మధ్యలో ఇల్లో, పెళ్లో అనుకుంటే జీపీఎఫ్ రూపంలో దాచుకున్న సొమ్ము తీసుకోవచ్చనే భావన..ప్రభుత్వ అవసరాల నిమిత్తం ఎర్నడ్ లీవ్స్ ఉపయోగించుకోవడం సాధ్యం కాకపోయినా సరెండర్ లీవ్ పేరిట ఆయా రోజులకు సంబంధించిన వేతనం కూడా వచ్చేస్తుంది. ఇదీ ప్రభుత్వ ఉద్యోగుల పట్ల ప్రజల్లో ఉన్న విశ్వాసం. కానీ ఇదంతా ఒకప్పటి మాట. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఒకటో తేదీ నాటికి ఖాతాల్లో జీతాలు పడతాయనే ధీమా లేదు. టీఏ, డీఏలు ఏండ్ల తరబడి పెండింగ్. ఇక ప్రోత్సాహకాలు ఆశించడం అత్యాశే అవుతుంది. జీతాలు రాక, ప్రోత్సాహకాలు అందక ప్రభుత్వ ఉద్యోగులు అనుభవిస్తున్న పరిస్థితి.



నవతెలంగాణ - హాజీపూర్

జిల్లా వ్యాప్తంగా సుమారు 20వేల మంది వరకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉన్నారు. గతంలో ప్రతి నెల 1 లేదా 2, 3 తేదీల్లోపు జీతాలు అందేవి. ప్రస్తుతం ఆయా తేదీల్లో జీతాలు తమ బ్యాంకు ఖాతాల్లో జమ కావడం లేదని, ఒక్కోసారి 20వ తేదీ వరకు అందడం లేదని ఎక్కువ శాఖల ఉద్యోగులు, అధికారులు ఆవేదన చెందుతున్నారు. పోలీస్, వైద్యారోగ్యం, విద్యుత్ వంటి అత్యవసర శాఖలకు ప్రాధాన్యతా క్రమంలో వేతనాలు వేస్తున్నారు. కానీ ఈ ఏడాది కాలంగా అవి సకాలంలో అందడం లేదని పలువురు పేర్కొంటున్నారు. గడిచిన రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉండడంతో ఉద్యోగులు కూడా చాలా వరకు అలవాటు పడ్డారు. సరెండర్ లీవ్‌లకు రావాల్సిన డబ్బులు రాకపోవడాన్ని ఉద్యోగులు జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రతి ఉద్యోగికి వారాంతపు సెలవులు, ప్రత్యేక సెలవులు, మెడికల్ లీవ్స్, ప్రసూతి సెలవులతో నిమిత్తం లేకుండా ఏడాదికి 20 నుండి 30 వరకు ఎర్నల్ లీవ్స్ ఉంటాయి. ఈ లెక్కన 30ఏళ్ల సర్వీసు గల ఉద్యోగికి ఏడాదికి 15 చొప్పున 490 సెలవులు ఆదా అవుతాయి. వీటికి సంబంధించిన ఎన్‌క్యాష్‌మెంట్ ఉద్యోగ విరమణ సమయంలో విడుదల చేస్తారు. కానీ నెలనెల మిగిలిపోయిన సెలవులకు ఎప్పటికప్పుడు ఉద్యోగులు దరఖాస్తు చేసుకుంటే చెల్లింపులు చేయాల్సి ఉంది. కానీ రెండేళ్లుగా వీటికి సంబంధించిన నగదు విడుదల చేయలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు లేదా సీనియర్ ఎంప్లాయ్ రూపంలో రావాల్సిన మొత్తం రూ.లక్షల్లోనే ఉంటుంది. ఎర్నడ్ లీవ్‌లకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల నుంచి ఆదాయ పన్ను సైతం ప్రభుత్వం వసూలు చేసింది. కానీ ఇంతవరకు ఆ డబ్బులు చెల్లించకపోవడంతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు.

ప్రోత్సాహకాలు కనుమరుగు?

జీతాలు సకాలంలో అందకపోవడంతో పాటు డీఏల ప్రస్తావన కూడా ప్రభుత్వం నుంచి కనిపించడం లేదు. సాధారణంగా కేంద్ర ప్రభుత్వం డీఏ ప్రకటించినప్పుడల్లా రాష్ట్ర ప్రభుత్వం కూడా పెంచడం మన రాష్ట్రంలో కొన్నేండ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ లెక్కన ఇప్పటి వరకు నాలుగు దఫాలుగా పెంచలేదని ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగి లేదా అధికారి తమ శాఖాపరమైన పనిపై ఎక్కడికైన వెళ్లినప్పుడు అందుకు అవసరమైన ప్రయాణం, భోజనం ఇతరత్రా ఖర్చుల నిమిత్తం కొంత బడ్జెట్ ఉండేదని, ఇప్పుడు అటువంటి పరిస్థితి దాదాపు కనిపించడం లేదని ఉద్యోగుల నుంచి అధికారుల వరకు చెబుతున్నారు. చివరకు వాహనాల అద్దెలు, పెట్రోల్ ఖర్చులు కూడా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటున్నారు. తమ సర్వీసులో ఎన్నడూ ఇటువంటి పరిస్థితులు చూడలేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఉన్న బడ్జెట్‌ను అటు ఇటు సర్దుబాటు చేసి ప్రజల మెప్పు పొందాలన్న ఆశ, యావ తప్ప ఉద్యోగులకు సకాలంలో ఆర్థిక ప్రయోజనాలు కల్పిచాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

జీతాలు సకాలంలో ఇవ్వాలి, ఎర్నడ్ లీవ్స్ డబ్బులు చెల్లించాలి

గొల్ల రామన్న, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు



ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ సంపాదిత సెలవు ఖాతా నిల్వ నుండి సంవత్సర కాలంలో 15 రోజులు చొప్పున, రెండు సంవత్సరాల కాలంలో 30 రోజుల చొప్పున సంపాదిత సెలవును ప్రభుత్వానికి సరెండర్ చేసి నగదు పొందుతారు. ఈ సౌకర్యం అన్ని యాజమాన్యాల వారికి వర్తిస్తుంది. 8 నెలలుగా ఈ విధంగా సరెండర్ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయుల బిల్లులు ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ బిల్లులను వెంటనే జమ చేయాలి. ప్రతి నెల ఒకటో తేదీన వేతనం పొందడం వేతన జీవుల హక్కు. కానీ కొంతకాలంగా ప్రతినెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించడం లేదు. ఈ నెల సంబంధించి జిల్లా ఉద్యోగులకు నేటికీ వేతనాలు జమ కాలేదు. జీతాలు రాక ఈఎంఐలు సరైన సమయంలో చెల్లించకపోవడంతో చెక్ బౌన్స్ అవుతూ క్రెడిట్ స్కోర్ తగ్గి అదనంగా వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న సరెండర్ నగదును వెంటనే చెల్లించాలి.

పోలీస్ ఫైరింగ్ రేంజ్ ప్రారంభోత్సవానికి చర్యలు

నవతెలంగాణ-వాంకిడి



జిల్లాలో పోలీస్ ఫైరింగ్ రేంజ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయని, ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. వాంకిడి మండలం ఇందాని గ్రామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ ఫైరింగ్ రేంజ్‌ను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఫైరింగ్ రేంజ్ పనులు ప్రారంభించబడి పూర్తి అయ్యాయని, త్వరలో ప్రారంభం కానుందని తెలిపారు. గతంలో ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది, మంచిర్యాల జిల్లాలోని బెల్లంపల్లి ఫైరింగ్ రేంజ్‌కి వెళ్లి ఫైరింగ్ నిర్వహించేవారన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆసిఫాబాద్ జిల్లా పోలీసులకు ప్రత్యేకంగా ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇందుకోసం ఇందాని గ్రామ శివారులో పోలీస్ శాఖకు చెందిన భూమిలో కొత్తగా ఫైరింగ్ రేంజ్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఫైరింగ్ రేంజ్ నిర్మాణానికి శ్రమించిన పోలీసులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అచ్చేశ్వరరావు, ఆసిఫాబాద్ డిఎస్పీ శ్రీనివాస్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ పాల్గొన్నారు.

ప్రజారోగ్య వ్యవస్థలను పటిష్టం చేయాలి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ప్రజారోగ్య వ్యవస్థలను పటిష్టం చేసి, వైద్య ఆరోగ్య సేవలను విస్తరింపజేయాలని రైట్ టు హెల్త్ ఫోరం, ఆర్‌టిహెచ్ఎఫ్ అధ్యక్షులు అడ్వకేట్ మోతె రాజలింగు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య, ఆరోగ్య సౌకర్యాల విస్తరింపజేయాలని కోరారు. గ్రామాల్లో, పట్టణాల్లో వైద్య సేవల లోటును సరిదిద్ది, ప్రజలకు సమగ్ర ప్రాథమిక వైద్య, ఆరోగ్య సేవలను అందించాలన్నారు. అధునాతన సాంకేతికతతో ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాలను ప్రతి గ్రామంలో, పట్టణంలో ఏర్పాటు చేసి, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల మెడికల్ మాఫియా నుండి బీద, బడుగు బలహీన వర్గాల ప్రజలను రక్షించాల్సిన బాధ్యత, ప్రభుత్వ యంత్రాంగంపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోతుల మురళీకృష్ణ, కార్యదర్శి పూదరి సతీష్, సహాయక కార్యదర్శి కడమంచి సాయి, నాయకులు ఆవునూరి రమేష్, ఓరగంటి వెంకట్ పాల్గొన్నారు.

అసెంబ్లీలో ఇచ్చిన హామీ నెరవేర్చాలి



నవతెలంగాణ-హాజీపూర్

కాంట్రాక్టు లెక్చరర్లకు సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఇచ్చిన హామీ నెరవేర్చి ఏప్రిల్ 1వ తేదీ నుండి తమ సర్వీసులు క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ స్పాట్ కేంద్రం వద్ద అరగంట పాటు మౌన దీక్ష చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2016లో కాంట్రాక్టు లెక్చరర్ క్రమబద్ధీకరణ కోసం జీఓ నెంబర్ 16 జారీ చేశారని అయితే కొంతమంది కోర్టులో సవాలు చేయగా 2021 సుప్రీంకోర్టు క్రమబద్ధీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ లెక్చరర్ క్రమబద్ధీకరణ చేస్తామని ప్రకటించిందని అన్నారు. దీనిలో భాగంగా సీఎం కేసీఆర్ ఫిబ్రవరి 6వ తేదీన కాంట్రాక్టు సిబ్బంది సేవలను ఏప్రిల్ ఒకటి నుండి క్రమబద్ధీకరిస్తానని చెప్పారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని సేవలు క్రమబద్ధీకరణ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకుల మనోవేదన తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా కాంటాక్ట్ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు నవీన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు ప్రసాద్, ప్రభాకర్, భీమయ్య పాల్గొన్నారు.

రంజాన్ రేషన్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ - కాగజ్‌నగర్

పట్టణంలోని మైనార్టీ ఫంక్షన్ హాల్‌లో దారుల్ అన్సారీ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం రంజాన్ రేషన్ కిట్లను ట్రస్ట్ సభ్యులు పంపిణీ చేశారు. అనంతరం ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ కాగజ్‌నగర్ వార్డుల్లో ఇంటింటికి సర్వే నిర్వహించి పేద ప్రజలకు, వితంతువులకు, కూలి, పాచి పని చేసేవారికి, వికలాంగులకు, విడాకులు తీసుకొని ఇంట్లో ఉన్న మహిళలకు ఇంటింటికి వెళ్లి 150 మహిళలకు క్వింటాల్ 50 కిలోల పప్పు, క్వింటాల్ 20 కిలోల చక్కెర, 12 కిలోల పసుపు పొడి, 12కిలోల మిర్చి పొడి, 12 క్వింటాల్ బియ్యం, 10 మంచి నూనె కార్టూన్లు, 60 కిలోల అల్లం ఎల్లిపాయ పేస్ట్, 12కిలోల టీ పొడి, క్వింటాల్ 20 కిలోల గోధుమలు, 60 గోధుమపిండి, బేసన్ పిండి, 60 కేజీల చింతపండు రంజాన్ రేషన్ కిట్లు తయారు చేసి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దారుల్ అన్సారీ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి ముఫాకం అహ్మద్, జాయింట్ సెక్రటరీ హఫీజ్ రియాజ్, కోశాధికారి రహీం మల్నాస్, అబ్దుల్ షకీర్, ట్రస్ట్ సభ్యులు అబ్దుల్ ముఖీమ్, తయ్యబ్ బిన్ ఈసా, ఫర్హాన్ పాల్గొన్నారు.

రూ.50వేల విలువ గల కలప స్వాధీనం

నవతెలంగాణ-జన్నారం



కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్ పరిధిలో అక్రమ కలప రవాణా మళ్లీ మొదలైంది. కొంతకాలంగా కలప దొంగలు స్తబ్దతగా ఉండి, ఈ మధ్యకాలం నుంచే చెలరేగిపోతున్నట్టు పలువురు చర్చించుకుంటున్నారు. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే కలప రవాణా సాగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. శుక్రవారం మొర్రిగూడ, కామనపల్లి, తండా, దేవునిగూడ, కవ్వల, కొత్తూరుపల్లి, హాస్టల్ తండాలో ఎఫ్‌డీఓ మాధవరావు ఆదేశాల మేరకు జన్నారం, ఇంధన్‌పల్లి రేంజ్ సిబ్బందితో కలిసి ఎఫ్ఆర్ఓ ఆఫీసుద్దీన్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రెండు మూడు రోజుల క్రితం కవ్వాల్ వైపు నుంచి కలప తరలిస్తున్న రెండు షిఫ్ట్ డిజైర్ కార్లు పట్టుబడడంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. ఆయా గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన అటవీశాఖ అధికారులు దాదాపు 40 చెక్కలు, రెండు టేకు దుంగలు రూ.50వేల విలువ చేసే, నిల్వ చేసిన కలపను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీలలో సెక్షన్ ఆఫీసర్లు కిరణ్మయి, జ్యోతి, అఫ్జల్, ఆనంద్, సహారా పర్వీన్, పరశురాం, శివకుమార్, రవి ఉన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో బస్సును లారీ ఢీకొట్టిన సంఘటన జిల్లా కేంద్ర సమీపంలోని ఆదిలాబాద్ ఎక్స్ రోడ్ వద్ద చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం..చంద్రపూర్ నుండి ఆసిఫాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు (టీఎస్ 20టి8666) ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు దాటి ఆసిఫాబాద్‌లో ప్రవేశించే క్రమంలో బైపాస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ వెనుక భాగంలో ఢీ కొట్టింది. బస్సులో మొత్తం 85 మంది ప్రయాణికులుండగా వాహనాల వేగం అదుపులో ఉండడంతో కొంతమందికి మినహా ఎవరికి ఎక్కువ గాయాలు కాలేదు. డిపో మేనేజర్ శ్రీధర్‌ను అడగగా బస్సులో ముగ్గురికి చిన్న గాయాలయ్యాయని, మహారాష్ట్ర దేవాడకు చెందిన సురేష్‌కు ఎక్కువ గాయాలు కావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ప్రమాద ఘటనలో ప్రయాణికులకు పెద్దగా గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

మండలంలోని భట్టుపల్లి జీడిచేను గ్రామానికి చెందిన మహమ్మద్ ఫారుక్(67) అదృశ్యమైనట్టు రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. ఫారుక్ గత నెల 29న ఇంటి నుంచి వెళ్లి కనిపించడం లేదు. ఆకుపచ్చరంగు షర్టు, కాఫీ రంగు ప్యాంటు ధరించాడని తెలిపారు. కుటుంబీకులు గాలించినా ఆచూకీ లభించలేదని ఫారుక్ కూతురు అబ్దుల్ మున్నీబేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్ నెంబర్ 8712670539కు సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

నిత్యావసర సరుకుల అందజేత

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని గోలేటిలో వృద్ధాశ్రమంలో శుక్రవారం సివిక్ సూపర్‌వైజర్ లేకూరి సుధాకర్-రజిత దంపతుల కుమార్తె లేకూరి అద్వైత పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు నిత్యావసర సరుకులతో పాటు, 25 కిలోల బియ్యం, కూరగాయలు, బ్రెడ్ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో సివిక్ కాంట్రాక్టర్ గోపిరెడ్డి, వాసు, సివిక్ కార్మికులు పాల్గొన్నారు.



కాసిపేట-2 గని సేఫ్టీపై అవగాహన

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం సేఫ్టీ గురువయ్య గనిలో చేపట్టే భద్రత విషయాలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం మోహన్ రెడ్డి, డీజీఎం గోపాల్ రాజు, ఏఎస్వో ఓదేలు, ఏరియా ఇంజనీర్ నాగరాజు, ఏజెంట్ కుర్మ రాజేందర్, మేనేజర్ రవీందర్, ఇంజనీర్ బసవరాజు పాల్గొన్నారు.



హాజ్ యాత్రకు వెళ్లేవారికి ఘన సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఖుర్ర పద్ధతి ప్రకారం ఎంపికై జిల్లా కేంద్రం నుండి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులు మీర్ సాబిర్ ఆలి హష్మీ, మొహమ్మద్ హారున్‌లను మసీద్ ఎ సహాబాలో మసీద్ కమిటీ అధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మసీద్ ఎ సహబా కమిటీ ఉపాధ్యక్షులు సయ్యద్ నిసార్, సయ్యద్ అహ్మద్‌షాలు మాట్లాడుతూ ముస్లింలకు అతి పవిత్రమైన హజ్ యాత్ర అని, హజ్ యాత్ర అదృష్టవంతులకే అవకాశం వస్తుందని అన్నారు. ఖుర్ర పద్ధతిపై ఇద్దరిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు కశిఫ్ హష్మీ, ఖిజార్ అహ్మద్, సయ్యద్ శభాజ్, అంజద్ పాషా, ఇంతియాజ్ అహ్మద్, పాషా, మసీద్ ఇమామ్‌లు సాజిద్‌ఖాన్, హఫీజ్ అస్లం, యూత్ సభ్యులు అబ్దుల్ అలీం, షేక్ అదిల్, షహీద్ ఖాన్, ముజహిద్ ఖాన్, అబ్దుల్ రెహ్మాన్, షేక్ షహీద్, ఎండి నిసార్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో రహపెల్లికి చెందిన రమేష్‌కు రూ.1లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ సంజీవని వంటిదని అన్నారు. దేశంలో ఎక్కడా లేని పథకాలు రాష్ట్రంలోనే అమలవుతున్నాయని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ సర్కారు కృషి చేస్తోందని అన్నారు. పేదలకు ఎటువంటి కష్టమొచ్చినా ఆత్మీయ భరోసా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

భారీ ఇఫ్తార్ విందు



నవతెలంగాణ-లక్షెట్టిపేట్

రంజాన్ పండుగను పురస్కరించుకొని పట్టణంలోని ప్రజలకు లక్షెట్టిపేట్ నాయకుడు, కరీంనగర్ కో-ఆప్షన్ మెంబెర్ సయ్యద్ అంజాద్ అలీ శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున సుమారు 1000 మందికి ఇఫ్తార్ ఏర్పాట్లు చేశారు. స్వయంగా ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య ముస్లిములకు ఇఫ్తార్ విందును వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు, మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, మాజీ డీసీఎంస్ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై లక్ష్మణ్, లక్షెట్టిపేట్ కో ఆప్షన్ సయ్యద్ సాహిద్ అలీ, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, మెట్టు రాజు హాజరై ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

ఇండ్ల స్థలాల కోసం పాదయాత్ర

నవతెలంగాణ - గోదావరిఖని

ఇండ్ల స్థలాల దరఖాస్తు దారులతో రామగుండం తహశీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామని సీపీఐ(ఎం) పెద్దపల్లి జిల్లా కార్యదర్శి వై.యాకయ్య అన్నారు. రామగుండం కార్పొరేషన్ 2వ డివిజన్‌లో గత నెల 19న ప్రారంభమైన భూ పోరాటం 20వ రోజు శుక్రవారం కొనసాగింది. భూపోరాట కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కార్యదర్శి వై.యాకయ్య మాట్లాడుతూ రెవెన్యూ అధికారులకు దరఖాస్తులు ఇచ్చి ఇన్ని రోజులు కావస్తున్నా ఎలాంటి కార్యచరణ చేపట్టలేదని అన్నారు. రెవెన్యూ అధికారులు వెంటనే చొరవ తీసుకొని ప్రభుత్వ భూమి గుర్తించి, అర్హులైనవారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంటనే స్పందించకుంటే రామగుండం తహశీల్దార్ కార్యాలయానికి పాదయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. గొడవలు సృష్టించి పోరాటాన్ని తప్పుదోవ పట్టించే చర్యలను మానుకోవాలని, అలాంటి వాటిని అందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీపీసీ రామగుండం ఏరియా కమిటీ కార్యదర్శి ఎం.రామాచారి, టీ.రవీందర్, ఎం.దేవేంద్ర, రమణ, ఉపేందర్, సురేష్, భాగ్య, సుజాత, నవీన్, సంపత్ తదితరులున్నారు.

హరీష్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలి

నవతెలంగాణ - గోదావరిఖని

ఆర్ఎఫ్‌సిఎల్ ఉద్యోగ బాధితులలో ప్రాణాలు పోగొట్టుకున్న ముంజ హరీష్ కుటుంబానికి వెంటనే పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.విశ్వనాథ్, సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి జూపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్ లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఏర్పాటు చేసి మాట్లాడారు. ఒప్పందం చేశామని చెప్పిన అఖిలపక్షం నేతలు కూడా దీనిపై ఇప్పటివరకు మాట్లాడటం లేదని, ఉద్యోగ బాధితులకు ఇప్పటివరకు ఎంత మేరకు డబ్బులు చెల్లించారో కూడా గోప్యంగా ఉంచాల్సిన అవసరమే ఏమొచ్చిందని ప్రశ్నించారు. భవిష్యత్తులో ఆర్ఎఫ్‌సిఎల్ ఉద్యోగ బాధితుల అంశంపై వామపక్ష పార్టీలుగా బాధ్యతతో వ్యవహరిస్తామన్నారు. 100 శాతం డబ్బులు తిరిగి ఇచ్చే విధంగా పోరాడుతామని తెలిపారు. సమావేశంలో నాయకులు గౌతం గోవర్ధన్, గుజ్జుల సత్యనారాయణరెడ్డి, కె.కనకరాజ్, తోకల రమేష్, తాళ్లపల్లి మల్లయ్య, యస్.ప్రసాద్, గుమ్మడి వెంకన్న, అడేపు శంకర్, శనిగరపు చంద్రశేఖర్, రేణికుంట్ల ప్రీతం, సిరిసిల్ల మల్లేష్, అబ్దుల్ కరీం, అసాల నవీన్, ఏ.మల్లయ్య, సంపత్ పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి

- బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు



నవతెలంగాణ-రెబ్బెన

తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కేకే గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌కు కార్యకర్తలే పార్టీకి బలమని అన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశారని అన్నారు. అదేవిధంగా సొంత స్థలం ఉన్నవారికి త్వరలోనే రూ.3లక్షలతో ప్రభుత్వం ఇంటి నిర్మాణాలకు అందిస్తోందని అన్నారు. సంక్షేమ రంగంలో దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని అన్నారు. రైతుల కోసం రైతుబీమా, రైతుబంధు లాంటి పథకాలను తీసుకొచ్చి రైతు కండ్లలో సంతోషం చూశారని అన్నారు. అదేవిధంగా రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలను దేశంలో అధికారంలో ఉన్న పార్టీలు ఏ రాష్ట్రంలో ఇవ్వడంలేదని అన్నారు. అదేవిధంగా ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ లాంటి పథకాలతో పేదింటి ఆడపడుచుల కుటుంబాలకు సీఎం కేసీఆర్ అండగా నిలిచారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు 70 ఏండ్ల పరిపాలనలో తెలంగాణ రాష్ట్రానికి చేసిందేమీలేదని గుర్తు చేశారు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత 9 ఏండ్లలో 70 ఏండ్లలో సాధించని అభివృద్ధిని కేవలం 9 ఏండ్లలో చూపించారని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఎన్నికల్లో వస్తే తప్పా ఎపుడు కూడా ఇక్కడి ప్రాంతాన్ని పట్టించుకోలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు సరైన బుద్ధి చెప్పాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని అన్నారు. అనంతరం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నుండి బైక్ ర్యాలీని కేకే గార్డెన్ వరకు నిర్వహించారు. ఈ సమ్మేళనానికి అధిక సంఖ్యలో వచ్చి విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు, మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ సౌందర్య ఆనంద్, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సింగిల్‌విండో చైర్మెన్ సంజీవ్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్ గాదవేణి మల్లేష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల భారీ బైక్ ర్యాలీ...

బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే సింగరేణి కార్మికులకు కోల్ ఇండియాలో లేని ఎన్నో హక్కులు అమలవుతున్నాయని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా సింగరేణి కార్మికులు గోలేటి టౌన్‌షిప్ నుండి రెబ్బెన మండల కేంద్రం వరకు ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు.



సంక్షేమ పథకాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలి

- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్



నవతెలంగాణ-కుభీర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలపై బీఆర్ఎస్ నాయకులు తమ తమ గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేస్తూ కేంద్ర ప్రభుత్వ పని తీరును ఎండగట్టాలని ఎమ్మెల్సీ గంగాధర్ గౌడ్ అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల మేరకు మండలంలోని మాలేగాంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముందుగా ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రసంగించారు. దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తూ రాష్ట్ర ప్రజల గుండెల్లోనే కాకుండా, బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలను చూసి దేశ ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. పక్కా రాష్ట్రమైన మహారాష్ట్రలో తమ బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. కానీ బీజేపీ నాయకులు కొందరు పనికట్టుకొని బీఆర్ఎస్ ప్రభుత్వంపై విషప్రచారాన్ని చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వ పథకాలను కరపత్రంలా తయారు చేసి వంద మందికి ఒక్క నాయకునిగా నియమించి, ప్రతి ఇంటికి ప్రచారం చేయాలని సూచించారు. అదే విధంగా ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాట్లాడుతూ గత 9ఏండ్ల నుంచి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తూ, దశల వారిగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని అన్నారు. మాలేగాం గ్రామస్తులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. లిఫ్ట్ ఇరిగేషన్, వ్యవసాయ పంట పొలాలకు వెళ్లడానికి అంతర్గత రోడ్లతో పాటు మాలేగాం గ్రామాన్ని మండల కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు సభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రేకుల గంగా చరణ్, వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, స్థానిక సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, బాసర జెడ్పీటీసీ వసంత్, జెడ్పీటీసీ శంకర్ చవాన్, యువజన సంఘం అధ్యక్షుడు రాజు, సోషల్ మీడియా అధ్యక్షుడు సంజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రమేష్, సాప్లీ సర్పంచ్ గంగాధర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ సంఘం అధ్యక్షులు కార్యకర్తలు ఉన్నారు.

'తెలంగాణకొచ్చే నైతిక హక్కు మోడీకి లేదు'

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కార్మిక కర్షక వర్గానికి తీరని అన్యాయం చేసిన ప్రధానికి తెలంగాణ రాష్ట్రానికి వచ్చే నైతికహక్కు లేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ రేపు మోదీ రాకను వ్యతిరేకిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సింగరేణి, ఆర్టీసీ కార్మికులతో పాటు జిల్లాలోని సంఘటిత, అసంఘటిత కార్మికులు జిల్లాలోని అన్ని మండలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలని అన్నారు. కోల్ ఇండియాలో విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ 4శాతంతో డీజిల్‌ను ఇవ్వాలని, ఎలక్ట్రికల్ బస్సులకు ఇచ్చే సబ్సిడీ నేరుగా ఆర్టీసీకి ఇవ్వాలని అన్నారు. విభజన హామీలను అమలు చేయాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ప్రాజెక్టులకు జాతీయ హోదా, గిరిజన యూనివర్సిటీతో పాటు హామీలను నేరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. ఇప్పటికైనా నరేంద్రమోడీ ప్రభుత్వం తెలంగాణకు ఏమి చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. మోడీ గో బ్యాక్ అన్నారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఏర్పడ్డాకే అభివృద్ధి

- ఎమ్మెల్యే దివాకర్‌రావు

నవతెలంగాణ-లక్షెట్టిపేట్

తెలంగాణ ఏర్పడ్డాకే అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లక్షెట్టిపేట్ మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. రూ.8 కోట్లతో సీసీరోడ్లు అన్ని వార్డుల్లో వేస్తున్నామని అన్నారు. అంతకుముందు మున్సిపల్ చైర్మెన్ కాంతయ్య మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఎల్లవేళలా ప్రజలకు అభివృద్ధి పథకాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ పోడేటి శ్రీనివాస్‌గౌడ్, కో-ఆప్షన్ షాహిద్ అలీ, కౌన్సిలర్ శభానా సజ్జు, నాయకులు అన్వర్ పాల్గొన్నారు.



వేసవి తాపం తీర్చుతున్న పుచ్చకాయలు



నవతెలంగాణ-గుడిహత్నూర్

ఎండలు మండిపోతున్న తరుణంలో ఎన్ని నీళ్లు తాగినా దాహం తీరని పరిస్థితి. రోజురోజుకు పెరుగుతున్న ఎండలకు జనం బెంబేలెత్తుతున్నారు. శీతల పానీయాలు, ఇతరత్ర వాటి జోలికి వెళ్లకుండా అందుబాటులో ఉండే పుచ్చకాయతో జనం సేద తీరుతున్నారు. పుచ్చకాయకు మార్కెట్‌లో గిరాకీ పెరిగింది. ఒక్కో కాయ సైజును బట్టి రూ.50 నుంచి 60 వరకు విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ యువకులు పుచ్చకాయలను అమ్మకాలు సాగిస్తున్నారు. మండలంలోని ఉట్నూర్ ఎక్స్ రోడ్డు వద్ద, రహదారుల పక్కన దుకాణాలు ఏర్పాటు చేసి పుచ్చకాయలు అమ్ముతున్నారు. దూర ప్రయాణాలు సాగించే ప్రయాణికులు ఈ ప్రాంతంలోకి రాగానే పుచ్చకాయలు కొనుగోలు చేసుకుని తీసుకువెళ్తున్నారు. ఎండ వేడిమి నుంచి పుచ్చకాయలతో సేద తీరుతున్నారు.

పుచ్చకాయల జ్యూస్...

వేసవి వచ్చిందంటే చాలు ఎక్కడపడితే అక్కడ పుచ్చకాయలు దర్శనమిస్తాయి. దీన్ని ముక్కలుగా తినడంతో పాటు, జ్యూస్‌గానూ తయారు చేసి తాగొచ్చు. రక్తపోటు నివారణకు దోహదపడుతోంది. శరీరానికి అవసరమైన నీటి శాతాన్ని అందిస్తుంది. ఎండలకు శరీరంలో తగ్గేనీటిని వీటితో భర్తీ చేసుకోవచ్చు.

ఆరోగ్యానికి మంచిది..

పుచ్చకాయలు ఆరోగ్యానికి మంచివి. ప్రతి వేసవిలో పుచ్చకాయలు అమ్మి ఉపాధి పొందుతున్నాను. ఎండలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు ఇష్టపడి తింటున్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది గిరాకీ పెరిగింది. ఇది ఆరోగ్యానికి మంచిది.

షేక్ నసీర్, గుడిహత్నూర్

మున్నూర్ కాపు సంఘం ఆధ్వర్యంలో డీఎస్పీకి సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

యాపల్‌గూడ మున్నూరు కాపు కులస్తులు డిఎస్‌పి ఉమేందర్‌ను రైతువేదిక భవనంలో శుక్రవారం సన్మానించారు. బొకే అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అవసరాన్ని బట్టి సహాయ సహకారాలు ఇచ్చిపుచ్చుకోవాలని సూచించారు. కలిసి ఉంటే సుఖంగా ఉండొచ్చని, మంచి మార్గంలో నడవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ రఘుపతి, ఎస్సై నాగనాథ్, ఎంపీపీ గంద్రత్ రమేష్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు అరిగెల కిష్టయ్య, ప్రధాన కార్యదర్శి సంతోష్, పెద్దకాపు జయరాం పాల్గొన్నారు.

బీసీ సంఘం నాయకులకు సన్మానం



నవతెలంగాణ-తలమడుగు

మండల బీసీ సంక్షేమ సంఘం నాయకులను శుక్రవారం మాజీ మంత్రి గేడం నగేష్, బిజెపి నాయకులు పాయల శంకర్, జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి వేరువేరుగా ఘనంగా సన్మానించారు. సన్మానం అందుకున్న వారిలో ఆ సంఘ నాయకులు మేకల రవికాంత్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వెంకన్న ఉన్నారు. వీరి వెంట బీసీ సంఘం నాయకులు సాంబశివ్, రమాకాంత్, పొచ్చన్న, రవీందర్, శ్రీనివాస్, శశికాంత్, వెంకన్న, జనార్దన్, సురేష్, లచ్చన్న, ప్రవీణ్, నవీన్, నరేష్, వినోద్, రాములు, శ్యామ్, వివిధ గ్రామాల కమిటీ అధ్యక్షులు, మండల కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

అరెస్టులతో సొనాల మండలం ఉద్యమాన్ని ఆపలేరు



నవతెలంగాణ-బోథ్

అరెస్టులతో సొనాల మండల ఉద్యమాన్ని ఆపలేరని మండల సాధన సమితి చైర్మన్ రాంరెడ్డి అన్నారు. శుక్రవారం సొనాల గ్రామంలో అదనపు గ్రామపంచాయతీ భవన ప్రారంభానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు వస్తున్న సందర్భంగా మండల సాధన సభ్యులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కావాలనే మండల ఏర్పాటుకు అడ్డుపడుతున్నారన్నారు. శాంతియుతంగా ఉద్యమాలు చేస్తే అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని తెలిపారు. అరెస్టు అయిన వారిలో మండల సాధన సమితి సభ్యులు బత్తుల రమేష్, గుడాల శేఖర్, చెట్లపల్లి అనిల్, గుంజాల భోజన్న కచ్చకాయల హరీష్, దినేష్ ఉన్నారు.

వ్యాన్ బోల్తాపడి వ్యక్తి మృతి



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ నుండి మహారాష్ట్రకు బెల్లం లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం (ఎంహెచ్ 33టి 0803) శుక్రవారం సాయంత్రం మండలంలోని బాబునగర్ సమీపంలో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ఉన్న మహారాష్ట్రలోని అల్లపల్లికి చెందిన అరుణ్ అనంద్‌రావు(23) అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాన్‌లో ముందు కూర్చున్న ఆత్రం సహదేవ్ జగదేవ్, నగేష్ సెడ్మక్, సిడాం సురజ్ నాందేవ్ గాయాల పాలయ్యారు. బెల్లం లోడ్‌పై కూర్చున్న ఇస్తం అరుణ్ ఆనంద్‌రావు వ్యాన్ కిందపడి మృతి చెందాడు. ఆత్రం గణేష్ సహదేవ్ గాయలపాలయ్యాడు. డ్రైవర్ రాంటెంకి ప్రణయ్ దిలీప్ అజాగ్రత్తగా నడపడంతో ప్రమాదం చోటు చేసుకుందని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈజ్‌గాం ఎస్సై జగదీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గుడ్‌ఫ్రైడే వేడుకలు

నవతెలంగాణ - సిర్పూర్(టి)

మండలంలో గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రిష్టియన్లు శుక్రవారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని బిలీవర్ చర్చి, కలువరి చర్చిలో చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. చర్చిల్లో పాస్టర్ పిలిప్, కీర్తికుమార్ క్రీస్తులు బోధనలు బోధించారు. అనంతరం క్రిస్టియన్‌లు ప్రార్థనలు నిర్వహించారు.

తాంసి : మండల కేంద్రంలోని చర్చిలో శుక్రవారం భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు జరుపుకున్నారు. చర్చి ఫాదర్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.